సాక్షి సూర్యాపేట

శనివారం, 13, సెప్టెంబర్, 2025



రైతులను ముంచుతారా

రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చి రైతులను ముంచుతారా అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రశ్నించారు. - 8లో



అధికారికంగా నిర్వహించాలి

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,17,240 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,17,240 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,000 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	6,325 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను మర్యాదపూర్వంగా కలిసిన అదనపు కలెక్టర్ సీతారామారావు

భానుపురి (సూర్యాపేట): జిల్లా అదనపు కలెక్టర్‌గా కొత్తగా నియామకమైన కొలనుపాక సీతారామారావు శుక్రవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీతారామారావు ఇటీవల నల్లగొండ జిల్లా స్పెషల్ కలెక్టర్ (ఐ–క్యాడ్)గా విధులు నిర్వహిస్తూ అదనపు కలెక్టర్‌గా సూర్యాపేటకు బదిలీపై వచ్చారు.

25, 26 తేదీల్లో పీవైఎల్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

కోదాదరూరల్ : ఈ నెల 25, 26 తేదీల్లో కోదాడ పట్టణంలోని లాల్‌బంగ్లాలో నిర్వహించ తలపెట్టిన పీవైఎల్ (ప్రగతిశీల యువజన సంఘం) రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల రమేష్, కోలా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లాల్‌బంగాల్లో ఎదుట శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, కోశాధికారి బండి రవి పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చివ్వెంల: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుతో పాటు, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోండ్రియాల పీఏసీఎస్ చైర్మన్‌గా నర్సింంహారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న బుర్రా నర్సింహారెడ్డి

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా లక్కవరం గ్రామానికి చెందిన బుర్రా నర్సింహారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాజీ చైర్మన్‌ను తొలగిస్తూ నూతన చైర్మన్‌గా నర్సింహారెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మూడోసారి సహకార సంఘం చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్రా పుల్లారెడ్డి, డైరెక్టర్లు వాడకొప్పుల పూర్ణయ్య, నెల్లూరి వెంకటప్పయ్య, ఏలూరి నాగయ్య, నెల్లూరి నర్సింహారావు, చుంచు లక్ష్మి, మాగి యాకోబు, బట్టా కొండల్‌రావు, బానోతు రాము, యేసోబు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



ఏపూరులో ఉద్యాన పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి నాగయ్య తదితరులు

ఆత్మకూర్ (ఎస్) : ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందిస్తామని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ (ఎస్) మండలంలోని ఏపూర్ గ్రామంలో సాగవుతున్న ఉద్యాన పంటలను సందర్శించి మాట్లాడారు. ఉద్యాన పంటల్లో కలుపు నివారణకు మల్చింగ్ పేపర్ ఏర్పాటు చేసుకున్నట్లయితే ఎకరానికి 8వేల రూపాలయ చొప్పున సబ్సిడీ అందింస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారి కట్ట స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి ఏ.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంటలకొద్దీ నిరీక్షణ..



అర్వపల్లిలో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

యూరియా కోసం రైతులకు తప్పని అవస్థలు

- పీఏసీఎస్, మన గ్రోమోర్ కేంద్రాల వద్ద రోజూ బారులే
- పొద్దస్తమానం లైన్‌లో ఉన్నా కొందరికే యూరియా
- సరిపడా అందించాలని వేడుకోలు



తిరుమలగిరి పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూకట్టిన రైతులు

తిరుమలగిరి(తుంగతుర్తి): రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒక పీఏసీఎస్, మనగ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఎగబడగుతున్నారు. శుక్రవారం పలు మండలాల్లోని పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల వద్దకు తెల్లవారుజామునే వచ్చి లైన్‌లో నిలబడ్డారు. కొందరు లైన్‌లో నిలబడలేక పాస్‌బుక్కులు, ఆధార్ కార్డులు, చెప్పులను పెట్టి తమ వంతు వచ్చేదాకా నిరీక్షించారు. చివరికి కొందరికే ఒక బస్తా యూరియా లభిస్తుండగా మరికొందరు అదికూడా దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వం స్పందించి తమకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని రైతులు వేడుకుంటున్నారు. శుక్రవారం తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా లోడ్ రావడంతో ఉదయం నుంచే రైతులు బారులుదీరారు. గతంలో టోకెన్లు ఇచ్చిన రైతులకు ఒక్కొక్కరికి రెండు యూరియా బస్తాలు ఇచ్చారు.

తెల్లవారుజాము నుంచి క్యూకట్టినా కొందరికే యూరియా

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా అర్వపల్లి పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం రైతులు శుక్రవారం తెల్లవారు జామునుంచే క్యూలైన్లలో ఉన్నారు. 450 బస్తాల యూరియా రాగా క్యూలైన్లో ఉన్న కొందరికే యూరియా దొరికింది. సుమారు 200 మంది రైతుల వరకు వెనుదిరిగి పోయారు.

మద్దిరాలలో టోకెన్ల కోసం..

మద్దిరాల : మద్దిరాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులుదీరారు. చాలా మంది ధర్నాకు యత్నించారు. స్థానిక ఎస్‌ఐ వీరన్న కలుగజేసుకుని టోకెన్లు ఉన్న రైతులకు ఇచ్చాకే మిగిలిన వారికి ఇస్తామనడంతో టోకెన్లకు ఎగబడ్డారు.

ఏపూరులో తోపులాట

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్, ఏపూరు పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే యూరియా కోసం క్యూలైన్లో కూర్చున్నారు. ఆత్మకూరు కేంద్రంలో సాయంత్రం 4 గంటల వరకు రైతులు ఎదురు చూసి వెనుతిరిగారు. ఏపూరులో 444 బస్తాలు పంపిణీ చేశారు. ఇక్కడికి పెద్ద సంఖ్యలో రైతులు చేరడంతో పంపిణీ సమయంలో స్వల్ప తోపులాట జరిగింది.



ఆత్మూర్(ఎస్) : ఏపూరు పీఏసీఎస్ వద్ద లైన్‌లో నిలబడిన రైతులు

బరాఖత్‌గూడెంలో ఎగబడిన రైతులు

మునగాల: మునగాల పీఏసీఎస్‌కు శుక్రవారం 222 బస్తాల యూరియా రావడంతో బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన రైతులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు టోకెన్లు ఇచ్చి మునగాలలోని సొసైటీ గోదాము వద్ద ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తా పంపిణీ చేశారు. కాగా శనివారం మునగాల పీఏసీఎస్‌కు వచ్చే యూరియాను మునగాల రైతులకు ఇస్తామని సొసైటీ కార్యదర్శి బసవయ్య తెలిపారు.

లైన్‌లో పాస్‌బుక్కులు పెట్టి..

చిలుకూరు: చిలుకూరు పీఏసీఎస్ పరిధిలోని దూదియాతండాలో గల గోదాముకు శుక్రవారం యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో రైతులు ఉదయం ఆరు గంటలకే గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పట్టాదారు పాస్‌బుక్కులు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. క్యూలో నిలబడిన రైతులకు ఒక్కో బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు.

తుంగతుర్తిలో ఉద్రిక్తత



తుంగతుర్తిలోని పీఏసీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తుంగతుర్తి : తుంగతుర్తిలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం వేకువ జాము నుంచే క్యూకట్టారు. ఒక ఆటోలో తీసుకెళ్తున్న యూరియాను కొందరు రైతులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఒకరికి ఇన్ని బస్తాల యూరియా ఎలా ఇస్తారని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, రైతులకు మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొనడంతో పీఏసీఎస్ కేంద్రాన్ని మూసివేశారు. ఎట్టకేలకు పోలీసులు సద్దిచెప్పి మళ్లీ యూరియా పంపిణీ చేశారు.

పెన్‌పహాడ్‌లో బారులు



పెన్‌పహాడ్‌లోని చీదెళ్ల పీఏసీఎస్ కార్యాలయం వద్ద పాస్‌పుస్తకాలు క్యూలైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

పెన్‌పహాడ్ : మండలకేంద్రంలోని చీదెళ్ల సహకార సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం వేకువజాము నుంచే రైతులు యూరియా కోసం వచ్చి క్యూలో పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టి గంటల తరబడి నిరీక్షించారు. 444 బస్తాల యూరియా రావడంతో వ్యవసాయ, రెవెన్యూ, సహకార శాఖల అధికారులు పట్టా పాస్ పుస్తకానికి ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. ఎస్‌ఐ గోపికృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పోరాటానికి కేంద్ర బిందువు నల్లగొండ



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, నాయకులు జానారెడ్డి, హన్మంతరావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- చరిత్రను తారుమారు చేసే పనిలో బీజేపీ ఉంది
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- వల్లాలతో అమరవీరుల స్మారకస్థూపం ఆవిష్కరణ



స్థూపాన్ని ఆవిష్కరించిన మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో జానారెడ్డి, వి.హన్మంతరావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

శాలిగౌరారం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్రబిందువు ఉమ్మడి నల్లగొండ జిల్లా అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సాయుధ పోరాటంలో అసువులు బాసిన వల్లాల గ్రామానికి చెందిన 10 మంది అమరవీరుల స్మారకార్థం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు సొంత ఖర్చులతో నిర్మించిన స్మారక స్థూపాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. వల్లాల ఘటనను వెలుగులోకి తీసుకువచ్చి, అమరవీరులకు స్మారక స్థూపాన్ని నిర్మించిన వి.హన్మంతరావు కృషి ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సిద్ధాంతపరంగా తలబడినా తెలంగాణ సాయుధ పోరాటంలో కలిసి ముందుకు సాగి విజయం సాధించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ..దేశ చరిత్రను తారుమారు చేసే పనిలో నిమగ్నమైందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గానీ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో గానీ, హైదరాబాద్ విలీనంలో గానీ బీజేపీ పాత్ర, పోరాటం ఏమిటో, ఎవరైనా ఆ ఉద్యమాల్లో పాల్గొన్నారో ఆ పార్టీ నేతలు చెప్పగలరా అని ప్రశ్నించారు. సాయుధ పోరాట అమరవీరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. అమరవీరుల కుటుంబీకులు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్లకు తాను వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రకటించారు. వల్లాలోని పురాతన పాఠశాలను అభివృద్ధి పర్చాలని ఎమ్మెల్యే మందుల సామేల్.. పీసీసీ అధ్యక్షుడిని కోరగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి వల్లాలకు వన్నెతెచ్చే విధంగా మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషిచేస్తానన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబీకులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మాజీమంత్రి కుందూరు జానా రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నేతివిద్యాసాగర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నాయకులు గుడిపాటి నర్సయ్య, నూక కిరణ్, అన్నెబోయిన సుధాకర్, గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, బొల్లికొండ గణేశ్, ఇంతియాజ్‌తదితరులు పాల్గొన్నారు.

70 శాతం మార్కులు వచ్చేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు, వెల్ఫేర్ కళాశాలలు, కేజీబీవీల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల మీద నమ్మకంతో విద్యార్థులు వస్తున్నారని, వారికి అర్థమయ్యేలా బోధించి ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ఈ సమావేశంలో డీఐఈఓ భానునాయక్, జీసీడీఓ పూలన్, డీసీఓలు పద్మ, లక్ష్మి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమించాలి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు

సూర్యాపేట అర్బన్ : సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, దివంగత నేత సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశ రాజకీయ రంగంలో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ యోధుల్లో సీతారాం ఏచూరి ఒకరన్నారు. సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, నాయకులు కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, ఎల్గూరి గోవింద్, పులుసు సత్యం, జె నరసింహారావు, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, కొప్పుల రజిత పాల్గొన్నారు.

వైభవంగా గరుడ వాహనసేవ

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం విశేషపూజలు కొనసాగాయి. శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం అనంతరం నిత్య కల్యాణం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. నీరాజనమంత్ర పుష్పాలతో మహానివేదనతో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

పత్రికా స్వేచ్ఛను కాలరాయొద్దు



- ఏపీలో సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు సరికాదన్న ప్రజా, ఉద్యోగ సంఘాల నేతలు
- మీడియాను అణిచివేయాలని చూడడం సరికాదని హితవు

పత్రికలపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపు ధోరణిపై ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి వినిపించడమే ప్రతిపక్ష పార్టీల కర్తవ్యమని, పత్రికలు, మీడియా బాధ్యత కూడా ఇదేనని పేర్కొంటున్నారు. కానీ ప్రజా సమస్యలను వినిపించుకోకుండా ఏకపక్షంగా మీడియాను అణచివేయాలనే ప్రయత్నం ప్రజా క్షేత్రంలో చెల్లుబాటు కాదని హితవు పలికారు. సాక్షి మీడియాపై ఏపీ ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపు చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. -సూర్యాపేట అర్బన్, సూర్యాపేటటౌన్

సాక్షిపై కక్షసాధింపు చర్యలు మంచిది కాదు



సమాజంలో నాలుగో స్తంభంలా ఉన్న మీడియాను అణిచివేయాలని చూస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఆ చర్యలను మానుకోవాలి. మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. సాక్షి మీడియాపై కక్షసాధింపు చర్యలు మంచిది కాదు. ఇకనైనా కూటమి ప్రభుత్వం తన పద్ధతి మార్చుకోవాలి.

– కొత్తపల్లి రేణుక, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు



పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వం తన పార్టీ ద్వారా పత్రికలపై దాడులు చేయించడం అంటే విలువలకు తిలోదకాలు ఇవ్వడమే అవుతుంది. తప్పుడు కథనాలు ప్రచురిస్తే కౌంటర్ ఇచ్చే అవకాశం ప్రభుత్వాలకు ఉండగా పార్టీ కార్యకర్తలతో దాడులు చేయించడం సరికాదు.

– రేపాక లింగయ్య, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సాక్షి ఎడిటర్‌పై కేసు నమోదు హేయమైన చర్య



ఆంధ్రప్రదేశ్‌లో ఒక మీడియా సమావేశాన్ని ప్రచురించినందు కు సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేయడం హేయమైన చర్య. ఇది ముమ్మాటికి కక్ష సాధింపు ధోరణే. ఎడిటర్‌తోపాటు ఇతర జర్నలిస్టులపైన నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– తంగెళ్ల వెంకటచంద్ర, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు

జర్నలిస్టుల గొంతు నొక్కడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే



వార్తాపత్రికలు మన ప్రజాస్వామ్యానికి నాలుగో మూల స్తంభం కానీ ఆంధ్రప్రదేశ్‌లో పత్రికల జర్నలిస్టులపై ఎడిటర్లపై దూషణతో కూడిన భౌతిక దాడులు చేయడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉంది. జర్నలిస్టుల గొంతు నొక్కడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

– జంపాల స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా విభాగం జిల్లా కన్వీనర్

మీడియాను అణిచివేయాలని చూస్తున్న ఏపీ ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను కాలరాయడం మంచిది కాదు. మీడియా అంటే సమాజంలో అవినీతిని బయటికి తీసుకొచ్చి ప్రజలకు తెలియజేసే ప్రచార సాధనం. అలాంటి మీడియాను లేకుండా చేయాలని ఉక్కుపాదం మోపుతున్న చంద్రబాబు అతని అనుచరులు తమ పద్ధతి మార్చుకోవాలి.

– యాతాకుల రాజయ్య మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు

జర్నలిస్టులపై దాడులు శోచనీయం



ప్రజల పాశుపతాస్త్రం సామాన్యుడి ఆయుధం సాక్షి. సమాజంలో వాస్తవాలను ప్రజలకు అందించే పత్రిక, టీవీ వీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేకుండా చేయాలనుకోవడం, ఆ పత్రికలో పనిచేసే జర్నలిస్టులపై దాడులు చేయడం మూర్ఖత్వానికి నిదర్శనం. ఏపీలోని కూటమి ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలి.

– మేకనబోయిన సైదమ్మ, ఐద్వా జిల్లా కోశాధికారి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలం మేళ్లదుప్పలపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం పోలీసలు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన జంజిరాల వెంకటేశం(25) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి నల్లగొండలో పనులు ముగించుకుని బైక్‌పై మేళ్లదుప్పలపల్లికి వెళ్తుండగా.. గ్రామ శివారులోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో పక్కనే చెట్ల పొదల్లో పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి భిక్షపమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

లారీ బీభత్సం


లారీ ఢీకొనడంతో ధ్వంసమైన దోజర్

తిరుమలగిరి(తుంగతుర్తి): తిరుమలగిరి చౌరస్తాలో లో శుక్రవారం సాయంత్రం లారీ బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ నుంచి బొగ్గు లోడుతో వస్తున్న లారీ డ్రైవర్‌కు తిరుమలగిరి చౌరస్తా వద్దకు రాగానే ఫిట్స్ రావడంతో అదుపుతప్పి దోజర్‌ను ఢీకొట్టాడు. పక్కనే ఉన్న తెలంగాణ తల్లి, జ్యోతిరావు పూలే విగ్రహాల గద్దెను కూడా ఢీకొట్టడంతో విగ్రహాలు ధ్వంసమయ్యాయి. లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌ను స్థానికులు కిందకు దింపి ఆస్పత్రికి తరలించారు. దోజర్ డ్రైవర్ కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో తిరుమలగిరి చౌరస్తాలో ట్రాఫిక్ జాం అయ్యింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, జేసీబీ సహాయంతో లారీ, దోజర్‌ను రోడ్డు పక్కకు తొలగించారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


జ్ఞానారామ్ (ఫైల్)

భువనగిరిటౌన్ : బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి లారీ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన జ్ఞానారామ్(42), ఎం. కుమార్ శుక్రవారం కోర్టు పని మీద బైక్‌పై భువనగిరికి వస్తున్నారు. భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్దకు రాగానే జగదేవ్‌పూర్ నుంచి నల్లగొండకు వెళ్తున్న లారీ వీరి బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోయింది. దీంతో వీరు రోడ్డు పక్కకు జరగడంతో బైక్ అదుపుతప్పి లారీ వెనుక టైరు కింద పడ్డారు. బైక్ నడిపిస్తున్న జ్ఞానారామ్ అక్కడికక్కడే మృతిచెందగా.. ఎం. కుమార్ రోడ్డు పక్కన పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు జ్ఞానారామ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొందరి కోసం రైతులను ముంచుతారా

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- అఖిలపక్షం ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన రీజినల్ భూనిర్వాసితులు
- హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకోకు యత్నం


చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయ ముట్టడిలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని దివీస్ పరిశ్రమ కోసం రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చిందని, కొందరి ప్రయోజనాల కోసం రైతులను ముంచుతారా అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రశ్నించారు. గతంలో రూపొందించిన ప్రకారంగా రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను ఉంచాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్, నారాయణపురం, వలిగొండ మండలాలకు చెందిన వివిధ గ్రామాల భూనిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనల ప్రకారం అలైన్‌మెంట్‌ను 40కిలోమీటర్ల దూరానికి మార్చాలని డిమాండ్ చేశారు. భూమికి భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం మూడు రెట్ల పరిహారం చెల్లించాలని నిర్వాసితులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లకంటి సత్యం పాల్గొని మాట్లాడుతూ.. కొందరికి మేలు చేసేందుకు వందలాది మందిని ఆగం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమను రైతులపై చూపాలన్నారు. కంపెనీలకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం మానుకోవాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అభివృద్ధి ముసుగులో చేసే మోసానికి వ్యతిరేకమని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు(ట్రిపుల్‌ఆర్) నడుమ దూరం 40కిలోమీటర్లు ఉండాల్సిందేనన్నారు. కోట్లు విలువ చేసే భూములు తీసుకుని, ప్రభుత్వం భూనిర్వాసితులకు చెల్లిస్తున్న డబ్బులతో స్థానికంగా ఒక్క ప్లాటు కూడా వచ్చే పరిస్థితులు లేవన్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పిడికి దివీస్ పరిశ్రమ నుంచి ప్రభుత్వానికి అందిన ముడుపులే కారణమని ఆరోపించారు. ముడుపులు ముట్టకుంటే జిల్లా మంత్రి, మునుగోడు ఎమ్మెల్యే రైతుల పక్షాన ఎందుకు ఉండడంలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్‌ను 60కిలోమీటర్ల దూరం నుంచి వేయిస్తానని చెప్పిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. గతంలోని అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ అంశాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్పిడి అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందన్నారు. రాష్ట్రం అలైన్‌మెంట్‌ను మారిస్తే అందుకు అయ్యే ఖర్చు భరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రం తీరుతో ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో గజ్వేల్, భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు ముక్కలవుతున్నాయని తెలిపారు. భూనిర్వాసితులకు న్యాయం చేస్తే కోమటిరెడ్డి బ్రదర్స్‌కు రాజకీయాలకతీతంగా పాలాభిషేకం చేస్తామన్నారు. నిర్వాసితుల వేదిక చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రమనగోని శంకర్, బూరుగు కృష్ణారెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, సుర్వి యాదయ్య, దూడల భిక్షంగౌడ్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, కై రంకొండ అశోక్, గిర్కటి నిరంజన్, పల్లె శేఖర్‌రెడ్డి, బొద్దు శ్రీనివాస్‌రెడ్డి, చిలుకల శ్రీనివాస్, కడారి కల్పన, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, చినుకని మల్లేశం, తాడూరి పరమేష్, తొర్పునూరి నర్సింహ్మ, భూనిర్వాసితులు పాల్గొన్నారు.


నిర్వాసితులు హైవేపై బైఠాయించకుండా అడ్డుకుంటున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి


నిర్వాసితులను డీసీఎంలో ఎక్కించి తీసుకెళ్తున్న పోలీసులు

ఉద్రిక్తత..

ఆర్డీఓ కార్యాలయం ముట్టడి ముగిసిన తర్వాత తిరిగి బయల్దేరే క్రమంలో భూనిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు హైవేపైకి వెళ్లి బైఠాయించారు. ఆందోళనకారులను పోలీసులు లాక్కెళ్లి తమ వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినా వెనక్కి తగ్గని నిర్వాసితులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాస్తారోకో చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. చేసేదేమీ లేక నిర్వాసితులు హైవే పైకి వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో పోలీసు వాహనాలను అడ్డుగా పెట్టారు. రోప్ పార్టీల ద్వారా జనాలను అడ్డుకున్నారు. భూనిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు చౌటుప్పల్ బస్టాండ్ వద్దకు చేరుకొని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అర్థం చేసుకొని ఆందోళన విరమించాలని పోలీసులు పలుమార్లు కోరడంతో శాంతించారు. కొంతసేపటి తర్వాత నిర్వాసితులను విడిచిపెట్టారు.


చౌటుప్పల్ బస్టాండ్ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న భూనిర్వాసితులు


జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

15న తిరునక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు అనుబంధ పాతగుట్ట ఆలయంలో ఈ నెల 15న శ్రీవైష్ణవానాం కణ్ణన్ తిరునక్షత్ర వేడుకలను నిర్వహించనున్నట్లు ఈఓ వెంకట్రావ్ శుక్రవారం వెల్లడించారు. ఆలయంలో వైష్ణవ సంప్రదాయం పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారంగా వేడుకలు నిర్వహించేందుకు అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 17న శిక్యోత్సవం(ఉట్లు కొట్టడం) నిర్వహించనున్నట్లు వివరించారు. అదే రోజు స్వామివారి ఆలయంలో రుక్మిణి కల్యాణం జరిపించనున్నట్లు వెల్లడించారు. కణ్ణన్ తిరునక్షత్ర వేడుకల సందర్భంగా 15న భక్తులచే జరిపించే నిత్య, శాశ్వత కల్యా ణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, భోగములను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు కణ్ణన్ పెరుమాళ్‌కు, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులకు నవకలశ స్నపన విశేష తిరుమంజన సేవ కై ంకర్యాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

సాయుధ పోరాట యోధుడు కన్నుమూత


రంగయ్య (ఫైల్)

మిర్యాలగూడ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కన్నెగంటి రంగయ్య (108) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో గల ఆయన కుమారుడి ఇంట్లో కన్నుమూశారు. మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన రంగయ్య సర్పంచ్ వ్యవస్థ ఏర్పడగానే మొదటిసారి యాద్గార్‌పల్లి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మండల వ్యవస్థ ఏర్పడ్డాక మొదటిసారి ఎంపీపీగా, సింగిల్‌విండో వైస్ చైర్మన్‌గా పనిచేశారు. నాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళ కమాండర్‌గా ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారు. ఆరు సంవత్సరాలు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జైల్లో, రెండు సంవత్సరాలు ముషీరాబాద్ జైల్లో గడిపారు. తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలో పనిచేశారు. కాగా రంగయ్య అంత్యక్రియలు శనివారం యాద్గార్‌పల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

- బీజేపీ తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి


తిరుమలగిరిలో బండి యాదగిరి స్మారక స్థూపానికి నివాళులర్పిస్తున్న అంజిరెడ్డి, బీజేపీ నాయకులు

తిరుమలగిరి(తుంగతుర్తి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలగిరిలో నిజాంకు వ్యతిరేకంగా కొనసాగిన పోరాటంలో అమరులైన బండి యాదగిరి, పోరెల్ల దాస్ స్మారక స్థూపాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న దోపిడి, అణచివేత, ఖాసీం రజ్వీ అమానుష పీడనను చరిత్ర ఎప్పటికీ మరచిపోదన్నారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతానికి స్వేచ్ఛ లభించిందని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం లాగానే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. బండి యాదగిరి, పోరెల్ల దాస్ త్యాగాల నుంచి యువత స్ఫూర్తి పొందాలి సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, విమోచన కమిటీ రాష్ట్ర కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, పాతూరి కరుణ, బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, సూర్యాపేట జిల్లా విమోచన కమిటీ కన్వీనర్ మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి: మహిళలు, యువతులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రిలేషన్‌షిప్ మేనేజర్ వి. అనిల్ అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై యువతులు, మహిళలకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఉపయోగాలను తెలియజేసిన ఈ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళలు గ్రూపులుగా ఏర్పడి చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకోగలిగితే ఎంతో మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఆరోగ్యం, ఆదాయం కూడా లభిస్తుందన్నారు. బ్యాంకుల ద్వారా లోన్ తీసుకోవడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి, శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, సీహెచ్. నరేష్, డి. ఆదర్శ్, పి. అక్షిత్ పాల్గొన్నారు.


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌బీఐ రిలేషన్‌షిప్ మేనేజర్ అనిల్

ఎన్‌సీసీ జాతీయ శిబిరంలో ఆలేరు క్యాడెట్ల ప్రతిభ


ప్రశంసా పత్రాలు అందుకున్న ఆలేరు ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆలేరు: వరంగల్ జిల్లా మామునూర్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంలో జరుగుతున్న ఎన్‌సీసీ జాతీయ శిబిరంలో ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పది మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు గాను వివిధ రాష్ట్రాలకు చెందిన క్యాడెట్లు తమ సంస్కృతి, ఆచారాలు, భాషలు, వంటలు, అలవాట్లు తదితర అంశాలను పరస్పరం పంచుకున్నారు. ఆయా అంశాల్లో ప్రతిభ కబరిచినందుకు గాను ఆలేరు ఎన్‌సీసీ క్యాడెట్లు శ్రేణిక, శ్రీజ, వెన్నెల, దేవిక, అర్చన, మణి తదితరులకు క్యాంపు డిప్యూటీ కమాండెంట్ కల్నల్ రామదురై, జాతీయ శిబిరం శిక్షణాధికారి లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, క్యాంపు అడ్జెసెంట్ డాక్టర్ ఎం. సదానందం తదితరులు అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ శుక్రవారం తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. రైతుకు గాయాలు

మద్దిరాల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో రైతుకు గాయాలయ్యాయి. ఈ ఘటన మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరెంట్ల గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం నుంచి చౌళ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాజానాయక్ తండాకు చెందిన బానోతు వెంకన్న శుక్రవారం యూరియా బస్తా బైక్‌పై వేసుకుని వెళ్తున్నాడు. అదే సమయంలో తుంగతుర్తి మండలం గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని దోనబండ తండాకు చెందిన భూక్య రాజు యూరియా కోసం బైక్‌పై గోరెంట్ల గ్రామంలోని ఫర్టిలైజర్ షాపు వద్దకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో గోరెంట్ల గ్రామ శివారులో ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బానోతు వెంకన్న కాలు, చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు.

పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటు

- ఫిరాయింపు ఎమ్మెల్యేలు కుంటిసాకులు చెబుతున్నారు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు కుంటిసాకులు చెబుతున్నారని, ఇంకా వారు దింపుడుగల్లం ఆశలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సమాధానాలు చాలా బలహీనంగా ఉన్నాయని, స్పీకర్‌కు ఇచ్చిన సమాధానంలో పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసం అంటే నమ్ముతారా అని అన్నారు. రేవంత్‌రెడ్డి తమకు కప్పింది కాంగ్రెస్ పార్టీ జెండా కాదు.. జాతీయ జెండా అని ఫిరాయింపు ఎమ్మెల్యేలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు అలా మాట్లాడి జాతీయ జెండాను అవహేళన చేయడం సరికాదన్నారు. దొంగతనం చేసి తప్పించుకోలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని, ఇప్పటికే పార్టీ విశ్వాసం కోల్పోయారని అన్నారు. నమ్మిన పార్టీకి, ప్రజలకు ద్రోహం చేసిన ఎమ్మెల్యేలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. కోట్లాది మంది ప్రజలకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని, కేసీఆర్‌పై నమ్మకం ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు నోటీసులు రాగానే కేసీఆర్ దగ్గరకే రావాలి కాదా.. మరేందుకు రాలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఇంటికెందుకెళ్లారో సరైన సమాధానం చెప్పాలన్నారు. ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జగదీష్‌రెడ్డి అన్నారు. వారిని రాజకీయంగా శాశ్వతంగా బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నల్లగొండ: ఆర్థిక ఇబ్బందులతో రైలు కింద పడి వ్యక్తి కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ సమీపంలోని సీతారాంపురం గ్రామం వద్ద శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన సోమిరెడ్డి(30) సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం సాయంత్రం నల్లగొండ సమీపంలోని సీతారాంపురం గ్రామం వద్ద జన్మభూమి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడి ఆత్మహత్యాయత్నం


తలకు గాయాలతో పీట్ల రాజు

మోటకొండూర్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి రెండో విడత డబ్బులు రాలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడేనికి చెందిన పీట్ల సుశీ–రాజు పేరుపై మొదటి విడతలో ఇందిరమ ఇల్లు మంజూరైంది. వారు ఇంటి నిర్మాణం బేస్మెంట్ లెవల్ పూర్తి చేశారు. దీంతో అధికారులు మొదటి విడుతలో లక్ష రూపాయలు ఖాతాలో జమచేశారు. గోడల లెవల్ పూర్తి చేసిన అనంతరం.. పీట్ల సుశీల పేరుపై వేహికిల్(టిప్పర్) ఉందని అధికారులు డబ్బులు ఆపేశారు. దీంతో పీట్ల సుశీల, రాజు పలుమార్లు అధికారులను కలిసి తమకు వాహనం లేదని గతంలో 2015లో ఉంటే ఫైనాన్స్ కంపెనీ వారు సీజ్ చేసి తీసుకెళ్లారని తెలిపారు. వాహనం టెక్నికల్‌గా మీ పేరుపై లేకుండా చేసుకోవాలని రాజుకు అధికారులు సూచించారు. సదరు ఫైనాన్స్ కంపెనీ వారి వద్దకు వెళ్లి లబ్ధిదారు అడగగా రూ.3లక్షలు బాకీ ఉన్నావని, ఆ డబ్బులు చెల్లిస్తేనే క్లియర్ చేస్తామని తెలిపారు. దీంతో రాజు తిరిగి అధికారులకు వద్దకు వచ్చి.. తాను తన భార్య నగలు కుదువబెట్టి అప్పుచేసి ఇంటి నిర్మాణం మొదలుపెట్టానని, తనకు రెండవ విడుత డబ్బులు వేయాలని కోరాడు. డబ్బులు వేయకుంటే తనకు చావు తప్పవేరే మార్గం లేదని.. ఇటుకతో తలకు కొట్టుకుని గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలిపాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, పీట్ల రాజు తనపై దాడి చేశాడని ఏఈఓ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

• సాగర్.. ఎనిమిది గేట్లు



నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నుంచి శుక్రవారం ఎనిమిది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 1,17,240 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తోంది. సాగర్ ఎనిమిది క్రస్ట్ గేట్ల ద్వారా 64,720 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 33,495 కూసెక్కులు మొత్తం 98,215 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం గరిష్టస్థాయిలో 590 అడుగులుగా ఉంది.

• అలుగు పోసిన 'డిండి'



డిండి: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి దుందుబి వాగు ద్వారా డిండి ప్రాజెక్టులోకి వస్తున్న వరద శుక్రవారం పెరిగింది. దీంతో ప్రాజెక్టులోకి 8800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.

• మూసీ.. మూడు గేట్లు



కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో శుక్రవారం 1137 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో అధికారులు మూడు క్రస్టు గేట్లను పైకెత్తి 1,935 క్యూసెక్కులు, కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా 479 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.